ఈ వారం కథ

బసవడు ప్రొద్దుటే ఆది చెప్పల కొల తలు తీసి, తోలు కోస్తున్నాడు. సుబ్బి చేటలో బియ్యం పోసుకుని బాగుచేస్తూ ఎదురుగా కూర్చుంది.

బసవడు భార్య వంక చూసి "ఏసుపాదం యింకా లెగలేదా?" అన్నాడు.

భార్యా మాట్లాడలేదు.

"ఆణ్ణి పొద్దున్నే లేపి, వంపేసుక నీళ్ళు తెప్పించకపోయావా?"

"విక్టోరియా తెత్తాందిగా?"

సుబ్బడు పనాపి చుట్టముట్టించాడు. ఒక తడవ పొగ పీల్చి "బంగారమంటి కోడలు దొరికింది. చక్కగా చదువుకుంది. ప్రభువు మీద పాటలుపాడి ప్రార్థన చేస్తుంది" అన్నాడు.

సుబ్బి బియ్యంలో వున్న మట్టి గడ్డలు ఏరి నోట్లో వేసుకుని చప్పరిస్తూ, తలెత్తి భర్త వంక చూసింది.

"నీ పెద్ద కొడుకు యాకోబు మాత్రం పెళ్ళాంకేం తీసిపోయాడు. ఆడూ చక్కగా కొమతం చేస్తున్నాడు" అంది.

"ఆడి సంగతెందుకుగాని, నీ చిన్న కొడుకు ఏసుపాదం సంగతి చూడు. ఎందుకూ పనికిరాకుండా పోతున్నాడు-" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"ఏదో తరగతన్నా యాడవరా, అన్నా. ఇంటేనా? కనీసం చెప్పలన్నా కుట్టటం నేర్పు దామనుకున్నా. ఊహూ! అదీ పనికిరాలా! వళ్లొంచాలంటే బద్ధకం."

సుబ్బి వింటూ కూర్చుంది. కాని భర్త రోజూ యిదే మాట చెప్పటం వలన ఆమెకు విసుగ్గా వుంది.

"ఏమొచ్చిందో ఏమో? నే పెట్టిన పేరు కూడా పనికిరాలా" అన్నాడు కొంచెం బాధగా.

సుబ్బికి కోపం వచ్చింది. ఆమె చిరచిర లాడుతూ "యేసుపాదం వద్దనుకుని మరో పేరు పెట్టుకున్నాడు. యిప్పుడు నీకొచ్చిన నష్ట మేంటి? వాడు పెట్టుకున్న పేరే బాగుంది. జార్జి అంటే వింటానికే సొంపుగా వుంది" అంది.

బసవడు చుట్టకాల్చి, అవతల పారేశాడు. ఒక మాటు తల తిప్పి యింటోకి చూసి "ఆ సన్నాసిని లేపు. చాలా పొద్దెక్కింది" అన్నాడు!

జార్జి కళ్ళు నలుపుకుంటూ వాకిట్లోకి వచ్చాడు. ఆవులిస్తూ తండ్రివంక చూశాడు. బసవడు కోపంగా చూస్తూ "తెల్లారిందా?" అన్నాడు.

జార్జి మాట్లాడలేదు.

"ఇరవయ్యేళ్ళొచ్చినియ్యి. ఈ రోజుకు ఒక్క పని చేతగాదు. వయసు రాగానే సరా?" అన్నాడు. జార్జికి కోపం వచ్చింది" అనవస రంగా నోరు పారేసుకోమాక" అన్నాడు.

ఆ మాటకు బసవడికి మరీ కోపం వచ్చింది మండే పొయ్యి మీద కిరసనాయలు పడిన ట్లయింది. అతను ఆరె, రాయి అవతలకు నెట్టి నేను నోరు పారేసుకున్నానా? వళ్ళు దగ్గరెట్టుకు మాట్టాడు" అన్నాడు.

జార్జి విసుక్కుంటూ "రోజూ పొద్దున్నే రేడియో పెట్టినట్టు మొదలెడతావు. ఏమా టపడితే ఆ మాట అంటావు" అన్నాడు.

సుబ్బి లేచి యిద్దరినీ సర్దబోయింది. బస వడు ఆమెను దూరంగా నెట్టి "నీ మూలాన యీడు అడ్డగాడిదలా తిరిగొత్తున్నాడు. అడ్డగుడ్డొకటి కట్టి, పోరంబోకు సన్నాసు లతో ఆ చర్చి ముందు పొద్దుగూకులూ కూసోని, కబుర్లు చెప్పకుంటే సరిపోతుందా? నాలుగేళ్ళు లోనకెళ్ళాలంటే వళ్ళొంచి పనిచే యాలి. ఇట్టాంటి బడుద్దాయి సన్నాసులకు పిల్లనిచ్చేవాడు కూడా దొరకడు" అన్నాడు యీసడిస్తూ.

ఆ మాటలకు జార్జికి వళ్ళుమండిపో యింది. కళ్ళెర్రబడ్డాయి.

"ఇంకో తడవ పిచ్చి కూతలు కూశావంటే బుర్ర రాంకీర్తన పాడుతుంది" అన్నాడు.

"అంత మగాడివయ్యావా?" అంటూ బస వడు చేయిస్సాచి జార్జి చెంపమీద కొట్టాడు. జార్జి తిరగబడి తండ్రి డొక్కలో గుద్దాడు. బసవడు కొడుకు జుట్టు పట్టుకుని లాగాడు. సుబ్బి మధ్యలోకెళ్ళి విడదీయబోయింది. తోపులాటలో ముసలి దంపతులు ఒకరి మీద ఒకరు పడ్డారు. చేటలోని బియ్యం చెల్లాచెదరైపోయాయి.

జనం పోగయ్యారు. విక్టోరియా దూరా న్నుండి యిది గమనించి, పరుగు పరుగున వచ్చింది. మరిది ముఖం వంక చూసింది. చెంప మీద వ్రేళ్ళ గుర్తులు తేలివున్నాయి. జార్జి కసిగా బుసలు కొడుతున్నాడు సుబ్బి శోకాలు తీస్తోంది.

విక్టోరియా వచ్చిన వాళ్ళను వెళ్ళిపొమ్మంది. మామను, అత్తను యింట్లోకి తీసుకు వెళ్ళింది. వాకిట్లోనే నిలబడిన జార్జితో "ముసలాయన ఏదో అంటాడు. నీవెందుకు పట్టించుకోవాలి?" అంది.

జార్జి వదిన వంక చూశాడు. ఆమె వంగి బియ్యం పోగుచేస్తోంది. అతను మాట్లాడకుండా బయటికి వెళ్ళిపోయాడు. నాలుగు రోజులయినాక మరిదికి అన్నంపె డుతూ విక్టోరియా అంది "జార్జి! శ్రీకా కుళంలో పాలకేంద్రం పెట్టారు. మనం ఒక గేదెను కొనుక్కుంటే పాలు అమ్ముకోవచ్చు. ఇంట్లోకి మజ్జిగ కూడా దొరుకుతాయి."

"డబ్బు కావాలిగా?" జార్జి ప్రశ్నించాడు.

ఆమె చిరునవ్వుతో "కావాలి. మనం ఏదో ప్రయత్నం చేయాలి.. మీ అన్నతో చెప్పాను..కమతం తాలూకు డబ్బులు తెచ్చి యిస్తానన్నాడు. ఊళ్ళో బ్యాంకులో అప్పిస్తా రని తెల్సింది. గేదెను కొనటానికి అప్లికేషన్ పెట్టు" సలహా చెప్పింది.

జార్జి వదిన వంక చూశాడు. ఆమె అందమయినదేకాక తెలివైంది కూడా అను కున్నాడు.

"ఏమిటలా చూస్తునావ్?" విక్టోరియా అడిగింది.

"ఏం లేదు, ఏం లేదు" జార్జి తడబ డుతూ సమాధానం చెప్పాడు.

అన్నీ సవ్యంగా కుదిరాయి. జార్జి, యాకోబు వెళ్ళి పాడి గేదెను తోలుకొ చ్చారు. చేతిలో నాలుగు రూపాయలు గలగల లాడుతున్నాయి. జార్జి స్వంతానికి ఖర్చు చేసుకున్నా విక్టోరియా చూసీ చూడ నట్టు వుంటోంది. కాని, జమా ఖర్చులు తేల్చి అతను ఎంత వాడుకున్నదీ చెపుతోంది. ఇందువలన దుబరాగా ఖర్చు చేయాలంటే జార్జికి సిగ్గుగా వుంది. జార్జికి నూగు మీసాలు పెరిగి నల్ల మీసాలయినాయి. క్రమేణా గడ్డం బరువెక్కింది. పురుషత్వం మూర్తీభవించింది. నరాల పటుత్వంలో మగ తనం ఉరకలు వేస్తోంది. కోడెత్రాచులా బుస గొడుతోంది. కామవాంఛ పడగ విప్పకుంది. కాని కట్టుబాట్లు, ఆచారాలు అడ్డుకుంటున్నాయి. జార్జికి తనను తాను నిగ్రహించుకోవటం కష్టంగా వుంది.

యౌవనోద్రేకం ప్రారంభ దశలో అందు బాటులోవున్నవారి మీదకు వాలిపోవాలనుం టుంది. లజ్జా భయాలను గమనించలేదు. వాని వరుసలను చూడజాలదు. కావలసింది తన కామాన్ని వెళ్ళగక్కటమే. కాటువేసి తన గరళాన్ని పుక్కిలి విప్పటమే.

అనాలోచితంగా జార్జికి విక్టోరియా మీద మనసు కలిగింది. ఆమె చనువు, ప్రేమ అపార్థానికి దారితీశాయి. కాని జార్జి తన భావాలను చెప్పలేక పోతున్నాడు. మనసంతా మథనపడిపోతోంది. క్రిష్టమస్ దగ్గర పడింది. బసవడి కూతురు బెజవాడ నుండివచ్చి, పండుగకు తల్లీ దండ్రిని తీసుకు వెళ్ళింది. యాకోబుకు కుప్ప నూర్పిళ్ళవలన ఊపిరాడ టంలేదు.

ఇంకో రెండు రోజులకు క్రిష్టమస్ వస్తుంది. యాకోబు చందకాడే అన్నంతిని కాపలా కెళ్ళాడు. జార్జి యింకా రాలేదు. ఇంట్లో వెలుతురు నిండుగా లేదు. ఆమె ఆలోచిస్తూ కూర్చుంది.

జార్జి ఆలస్యంగా వచ్చాడు. గూడెమంతా నిశ్శబ్దంగా వుంది. అతను పొట్లాం తెచ్చి విక్టోరియాకిచ్చాడు. ఆమె దాన్ని విప్పకుండానే "ఏమిటి?" అని అడిగింది.

"చూడు. నీకే తెలుస్తుంది."

ఆమె పొట్లం విప్పింది. అందులో పౌడరు డబ్బా సెంటు బాటిలు కాటుక వున్నాయి. చేమంతులున్నాయి. విక్టోరియా మరిదివంక చూసి "జార్జి! యివన్నీ నాకెందుకు? ఈ వేసవిలో నీ పెళ్ళి చేస్తాంగదా! మా చెల్లెలు వచ్చిన తరువాత యివన్నీ ఆమెకిస్తాను. అందాకా దాస్తాను. ఈ పూలు మాత్రం దండకట్టి మేరీ మాతకు అలంకరిస్తాను" అంది.

జార్జి చిన్నబుచ్చుకున్నాడు.

ఆమె కంచంలో అన్నం పెట్టింది. వంగి కూర వడ్డిస్తోంది. ఆమె పమిట జారింది. యౌవనంతో బిగువుగావున్న అవయవాలు పొందికగా కన్పిస్తున్నాయి. జార్జి తలఎత్త కుండా రెండు మూడు పర్యాయాలు చూశాడు. విక్టోరియా యిది గమనించలేదు.

జార్జి అన్నం కలిపాడు. సరిగా తినలేదు. ఆమె ఆశ్చర్యపోతూ "మరిదీ! బజారులో ఏమైనా తిని వచ్చావా?" అని అడిగింది.

జార్జి మాట్లాడలేదు. లేచివెళ్ళి వాకిట్లో పందిరికింద నిలబడి ఆలోచిస్తున్నాడు.

విక్టోరియా వాత్సల్యంగా పిలిచింది "జార్జి! బయట చలిగా వుంది. లోనికిరా" జార్జి లోనికి వస్తూ వదినను రాసుకుంటూ వెళ్ళాడు. విక్టోరియా పట్టించుకోలేదు. బజా రులో ఏదో గొడవ జరిగి వుంటుందను కుంది.

ఆమె మంచం వాల్చి, దుప్పటి వేసింది. జార్జి తెలియనట్టు వదిన భుజం మీద చేయి వేశాడు. రెండో చేత్తో ఆమెను తనవైపు తిప్పకున్నాడు.

విక్టోరియాకు పరిస్థితి అర్థమయింది. ఆమె అతని చేతిని ప్రక్కకు తీసి ఏమీ ఎరగనట్టు "మరిదీ! నీకు నిద్ర బాగా వచ్చినట్లుంది. నువ్వు పడుకో. లేకపోతే తూలి పడగలవు. అని తలుపు తెరచింది. వాకిట్లో చాప వేసుకుని గడపమీద తల ఆనించి పడుకుంది.

వీధి దీపం వెలుతురు వాకిట్లో పడు తోంది. జార్జి చర్చి వైపు వెళ్ళిపోయాడు.

క్రిష్టమస్‌నాడు కూడా యాకోబుకు తీరిక లేదు. విక్టోరియా మరిదిని వెంటతీసుకుని చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేసి వచ్చింది. తమ యింట్లో మేరీమాతకు, ప్రభువుకు జార్జితో పూజ చేయించింది. తాను మోకరిల్లి "తల్లీ! మేరీమాతా! మమ్ములను కరుణతో చూడమ్మా, నాకు సంతానం ప్రసాదించమ్మా! జార్జిని నా ప్రథమ సంతానంగా చూసుకుంటున్నాను. నా పుత్రుడనే సాకుతున్నాను. కరుణతో నా బిడ్డకు మంచి నడవడి ప్రసాదించు తల్లీ!" అన్నది. ఆమె ఏసు ప్రభువును పూజించి "ప్రభూ! కరుణామయా! పరమ పవిత్రమయిన నీ రక్తాన్ని చిందించి పాపు లను మంచి మార్గాన తిప్పటానికొచ్చావు. దైవకుమారా! మా జార్జికి ఆయురారో గ్యాలు ప్రసాదించు తండ్రీ! సుగుణాలను ప్రసాదించుతండ్రీ!" అని కన్నీరు కార్చింది. ఆర్తితో ప్రార్థించింది. జార్జి అంతా గమ నించాడు. చలించిపోయాడు. తానూ మన సులో ప్రార్థించుకున్నాడు. పశ్చాత్తాపంతో అతని గుండె కరిగి కన్నీటి ధారలుగా ప్రవ హించింది.

విక్టోరియా ప్రార్థన ముగించి లేచింది. జార్జి లేచి వదిన పాదాలకు నమస్కరిం చాడు. ఆమె తన పాదాలను దూరంగా తీసుకుని "జార్జి! ఇదేం పని" అంది. జార్జి తల దించుకునే "మేరీమాతకు నమస్కరిస్తు న్నాను" అన్నాడు.

విక్టోరియాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె నెమ్మదిగా అంది "జార్జి! సైతాను అనేకం చేయిస్తుంది. పశ్చాత్తాప పడితే సర్వ పాపాలూ పోతాయి. ఆ ప్రభువు దయామయుడు. తప్పక కరుణిస్తాడు."

పొలాన్నుండి వచ్చిన యాకోబు తన భార్య అంటున్న చివరి మాటలు విన్నాడు. సంతోషపడ్డాడు.

విక్టోరియా భర్త దగ్గరకు వెళ్ళి "మీరు కూడా మేరీ మాతను, ప్రభువును ప్రార్థిం చండి. జార్జి మన బిడ్డ అని దైవ ప్రార్థన చేశాను" అంది.

మరిది మనో వ్యథతో వుండటం విక్టో రియా గమనిస్తూనే వుంది. కొసరి కొసరి వడ్డించి, ప్రేమగా చూసుకుంటోంది. కాని జార్జికి నచ్చచెప్పలేకపోతోంది. పాత సంగతి ఎత్తటం ఆమెకు యిష్టం లేదు.

జార్జి పది గంటలకు బయటికి బయలుదే రాడు. వెనుకనుండి విక్టోరియా కేక వేసింది "జార్జి! ఎక్కడకు వెళ్తున్నావ్? అన్నం తిని వెళ్ళు."

"ఇప్పడే తిరిగొస్తా" అంటూ శ్రీకాకుళం వెళ్ళాడు. నదవ దాటి పోతార్లంక వెళ్ళాడు. తన బాల్య స్నేహితుడు ఆ ఊళ్ళో వున్నాడు. అతనితో గడిపితే మనశ్శాంతి లభిస్తుంద నుకున్నాడు. కాని ఆ స్నేహితుడు ఊళ్ళో లేడు.

జార్జి నదవదాటి యివతల కొచ్చాడు. కడుపులో ఆకలి భగభగ మంటోంది. కడు పునిండా కృష్ణ నీరు త్రాగాడు. తలవం చుకుని, యిసుకలో నడచి, వడ్డు దగ్గర కొచ్చాడు. కొంచెం దూరంలో అరటితోట దగ్గర సుమన్ కనించాడు.

స్కూల్లో చదివే రోజుల్లో జార్జి పోకిరీగా వుండేవాడు. సుమన్‌తో తగాదాపడి అతని మీద చేయి చేసుకున్నాడు. ఆడపిల్లలను ఏడిపించటం, గిల్లి కజ్జాలు పెట్టుకోవటం సరదాగా వుండేది.

సుమన్‌కు జార్జి అంటే అసహ్యం. అప్ప టిన్నుండి జార్జితో మాట్లాడేవాడు కాదు. సుమన్ చూడనట్టు అరటి తోటవైపు తల తిప్పకున్నాడు.

"సుమన్ బాబూ! బాగున్నావా?" జార్జి అడిగాడు.

సుమన్ అయిష్టంగా "బాగానే వున్నా" అన్నాడు.

"సుమన్ బాబూ! మీరు చదువుకోమని ఎంత చెప్పినా వినకుండా గాలిగా తిరిగాను. చివరకు మీతో తగాదాపడి చేయి చేసు కున్నాను. నా జీవితాన్ని నేనే పాడుచేసుకు న్నాను" అన్నాడు.

సుమన్‌కు ఆశ్చర్యం వేసింది.

"ఇప్పడు చదువుకోవాలని వుంది. కాని వయసు దాటిపోయింది" జార్జి అన్నాడు.

"దాందేముంది. ఏ వయసులోనైనా చదువుకోవచ్చు" సుమన్ ప్రోత్సహించాడు.

జార్జి మాట్లాడలేదు. కాస్సేపు ఆలోచిస్తూ కూర్చున్నాడు. చివరకు, నెమ్మదిగా అడి గాడు "నాకు చదువొస్తుందంటారా?" జార్జి స్వరంలో బాధ స్పష్టంగా విన్పించింది. సుమన్ దాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు.

"తప్పకుండా వస్తుంది. త్వరగా కూడా వస్తుంది" సుమన్ జార్జిని పరిశీలనగా చూశాడు. జార్జిలో ఏదో తెలియని ఆవే దన కన్పిస్తోంది. మామూలుగా అతనిలో కన్పించే పోకిరీ లక్షణాలు, పొగరుబోతు చేష్టలు మచ్చుకు కూడా లేవు. అతని ముఖంలో ఏదో తెలియని మార్పు వుంది.

"జార్జి! నిన్నొకటి అడుగుతాను. చెపు తావా?" సుమన్ ప్రశ్నించాడు.

జార్జి తలవంచుకునే సమాధానం చెప్పాడు.

"అడగండి"

"నీలో యీ మార్పుకు కారణం ఏమిటి?" సుమన్ సూటిగా అడిగాడు.

జార్జి మాట్లాడలేదు. తల తిప్పలేదు.

"అనవసరంగా యీ ప్రశ్నవేసి నిన్ను బాధ పట్టాను" సుమన్ అన్నాడు. జార్జి అప్పడూ మాట్లాడలేదు. నెమ్మదిగా తలెత్తి సుమన్ వంక చూశాడు. మరల తల తిప్పకుని అన్నాడు "సుమన్‌బాబూ! మీరన్నది నిజమే. నా బాధను దాచుకోవాలనుకున్నా కుదరటం లేదు. ఎవరికో ఒకరికి చెప్పకుని హృదయ భారాన్ని తగ్గించుకోవాలి. లేకుంటే నా గుండె పగిలిపోయేటట్లుంది."

జార్జి కనుల వెంట బొటబొట కన్నీరు జారింది.

సుమన్ ఆశ్చర్యపోతూ వింటున్నాడు.

జార్జి బరువుగా అన్నాడు.

"బాబూ! నిప్పల గుండంలో భగ భగమని మండిపోతున్నాను. నా శరీరం కాలి బూడి దయిపోతోంది. బాబూ! అది దహించుక పోతోంది. నేను మీకు తెలిసిన జార్జిని కాను. ఇప్పడు మీరు చూస్తున్నది పశ్చాత్తాపంతో ప్రతి అణువూ కణకణ కాలిపోతున్న పాపిని. బాబూ! నేను పాపిని! మహా పాపిని" అన్నాడు.

అతని కళ్ళవెంట ధారగా కన్నీళ్ళు కారాయి. గొంతు బొంగురుపోయింది. తల వంచుకుని జార్జి అలాగే కూర్చున్నాడు.

సుమన్ చలించి పోయాడు. తను కొంచెం జరిగి జార్జి చేతిని తన చేతిలోకి తీసుకు న్నాడు. "బాధ పడకు జార్జి! మనం మను షులం. తప్పచేస్తాం. తప్ప తెలుసుకుని పశ్చా త్తాపం చెందుతాం. అది చాలు. అయినా జార్జి! నీ బాధేమిటో నాకు అర్థం కావటం లేదు. నాకు తెలిస్తే నేను చేయగలిగింది చేస్తాను" అన్నాడు. జార్జి నెమ్మదిగా చెప్పాడు. "బాబూ! ఈ విషయం చెప్పవద్దనుకున్నాను. నాతోనే పూడిపోవాలనుకున్నాను. కాని నా గుండె ఆగటం లేదు. నా మంట చల్లా రటం లేదు. నేను దాచుకోలేక పోతున్నాను. ఎవరితో చెప్పినా పరువు పోతుంది. చెప్ప కోకపోతే గుండె పగులుతుంది. బాబూ! నా మనసు విప్పి చెపుతాను. మీరావిషయం ఎవ్వరికీ చెప్పనని మాట యివ్వగలరా?"

"అలాగే జార్జి"

అతను జరిగింది చెప్పాడు. చివరకు "నేనెంత పాపిని? ఎంత అజ్ఞానిని? మేరీ మాతను మైలపరచాలనుకున్నాను. ఆ తల్లి నన్ను బిడ్డగా దీవించింది. బాబూ! యీ సంఘటన తరువాత బ్రతకాలని అనిపిం చలేదు. రెండు పర్యాయాలు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాను. అప్పడు కూడా ఆ దేవతే అడ్డుపడింది. ఆ కరుణామయి కాపాడింది. నా చావు వలన తనకు పుత్ర శోకం కలుగుతుందని, దాన్ని భరించలేనని చెప్పింది. మనిషిగా బ్రతకమంది. ఏ విధ మైన అఘాయిత్యం చేయవని నాతో మాట తీసుకుంది. బాబూ! నాకు వేరే మార్గం లేదు. నేను చదవాలి. మనిషిగా ఎదగాలి. దేవుని రాజ్యంలో ప్రవేశించటానికి అర్హత సంపాదించాలి" అన్నాడు.

సుమన్ అనునయంగా చెప్పాడు. "జార్జి! యింతవరకు నిన్ను దూరంగా వుంచాను. ఈ క్షణం నుండి మనం సోదరులం. చదువుకో. నీకు చాలా త్వరగా చదువు అబ్బుతుంది. మంచివానిగా పేరు తెచ్చుకో గలవు" అన్నాడు. జార్జి ఒక నిట్టూర్పు విడిచి మౌనంగా కూర్చున్నాడు. సుమన్ మరల అన్నాడు.

"జార్జి! నేను అనేక మందిని చూశాను. అనేక కథలు చదివాను. మీ పెంపుడు తల్లి విక్టోరియా నిజంగా దేవతేనయ్యా! మీరు కొలిచే మేరీమాతే! అందుకు సందేహం లేదు."

జార్జి మాట్లాడలేదు. కాని తన కుడిచే తిని లేపి శిలువ గుర్తు వేసుకున్నాడు.

"పశ్చాత్తాపంతో నీవు పవిత్రతను పొందావు. నీబోటి వ్యక్తులుంటే యీ సమాజం పరిశుద్ధతను పొందుతుంది. మాలిన్యం తొలిగి పవిత్రత సర్వత్రా ప్రకాశి స్తుంది. అందుకే నిన్ను చూసి గర్విస్తున్నాను. నువ్వు అగ్ని క్షేత్రాన్నుండి ఆవిర్భవించిన పవి త్రమూర్తివి. నీకెంతో భవిష్యత్తు వుంది. దారి తొలగవద్దు. ఆదర్శంగా నడువు. మాబోటి వాళ్ళం నీ అడుగుజాడల్లో నడిచేలా ఆదర్శ మూర్తిగా ప్రవర్తించు" అన్నాడు.

జార్జి ముఖంలో మబ్బులు తొలిగాయి. కళ్ళల్లో శాంతి ప్రతిఫలించింది. హృద యంలో ప్రశాంతత నిండింది. మరోమారు శిలువ గుర్తు వేసుకుని సుమన్‌కు నమ స్కరించాడు. స్నేహితులిద్దరూ ఒకరి వెనుక ఒకరు నిశ్శబ్దంగా బయలుదేరారు.